జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

శనివారం
07-11-2026

సంపుటి 1 | సంచిక 345

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)

రేవంత్‌ను కలిసేందుకు 350 కిలోమీటర్ల పాదయాత్ర

కర్నూలు నుంచి హైదరాబాద్‌కు 9 రోజుల నడక.. అభిమానాన్ని చాటుకున్న సాయన్న



దశ, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకున్న అభిమానాన్ని చాటుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన సాయన్న వినూత్నప్రయత్నం చేశాడు. ముఖ్యమంత్రిని నేరుగా కలుసుకోవాలనే ఆకాంక్షతో ఏకంగా 350 కిలోమీటర్ల మేర కాలినడకన ప్రయాణించి హైదరాబాద్‌కు చేరుకున్నాడు. అక్టోబర్ 29న ఆదోని నుంచి తన పాదయాత్ర ప్రారంభించిన సాయన్న.. తొమ్మిది రోజుల పాటు ప్రయాణించి శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నాడు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన అభిమానాన్ని వ్యక్తం చేశాడు. ముఖ్యమంత్రిని కలిసేందుకు ఇంత దూరం కాలినడకన రావడం చర్చనీయాంశంగా మారింది.

చార్జింగ్‌లో ఉన్న ఎలక్ట్రిక్ కాంటా ప్రాణాంతకం

షాక్‌తో పది నెలల పసిపాప మృతి

దశ, జగిత్యాల: ఇంట్లో చార్జింగ్‌లో ఉన్న ఎలక్ట్రిక్ కాంటా ఓ పసిపాప ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన జగిత్యాల జిల్లాలోని రాజారాంపల్లెలో చోటుచేసుకుంది. పాకుతూ వెళ్లిన పది నెలల చిన్నారి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం.. చిన్నారి తల్లిదండ్రులు ఎలక్ట్రిక్ కాంటాను చార్జింగ్‌కు పెట్టి తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో పది నెలల పాప పాకుతూ వెళ్లి చార్జింగ్‌లో ఉన్న కాంటాను

..మిగతా 4వ పేజీలో ➔



స్పోర్ట్స్ బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

తండ్రి నిరాకరించడంతో మనస్తాపం.. చికిత్స పొందుతూ మృతి

4లో



రంగారెడ్డి జిల్లా అస్తిత్వాన్ని దెబ్బతీస్తే సహించం

జిల్లా ఉనికిని కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం

ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం

మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్

దశ, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా అస్తిత్వాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని పలు మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా మార్చి జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సిఎంసీలలో విలీనం చేయడం ద్వారా ప్రజలపై పన్నుల భారం పెంచారని ఆరోపించారు. తాజాగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలను మూడు ముక్కలుగా విభజించే నిర్ణయాలతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. దివంగత కే.వి. రంగారెడ్డి పేరు మీద ఏర్పడిన జిల్లాను కనుమరుగు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పేరు మార్పుపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ, జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని ఆలోచిస్తున్నారా అని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా అస్తిత్వాన్ని కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, అవసరమైతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

రాజధానిలో నీటి కష్టాలు

ట్యాంకర్ల బంద్‌తో సరఫరాకు అంతరాయం.. విద్యార్థులు, ఉద్యోగులకు ఇక్కట్లు

హాస్టళ్లు మూసివేసే పరిస్థితి!.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్

దశ, హైదరాబాద్: భాగ్యనగరంలో నీటి కొరత రోజురోజుకూ తీవ్ర సమస్యగా మారుతోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన బంద్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిచిపోవడంతో హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలపై ప్రభావం పడుతోంది. ముఖ్యంగా హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు తాగునీరు, స్నానాలు, వంట వంటి కనీస అవసరాలకు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని యజమానులు హెచ్చరిస్తున్నారు. అమీర్‌పేట ప్రాంతంలోని ప్రైవేట్ హాస్టళ్లకు గత రెండు రోజులుగా వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. ఈ విషయంపై అమీర్‌పేట వెల్ఫేర్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, ఇతర సభ్యులు ఎస్ఆర్ నగర్‌లోని వాటర్ వర్క్స్



కార్యాలయానికి వెళ్లి జనరల్ మేనేజర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గురువారం నుంచి హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని, అవసరమైతే నగరవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నీటి కొరత ప్రభావం కార్పొరేట్ విద్యాసంస్థలపైనా పడుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకునే కళాశాలలకు రోజూ భారీ మొత్తంలో నీరు అవసరమవుతుంది. ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో తాగునీటితో పాటు ఇతర అవసరాలకు

..మిగతా 4వ పేజీలో ➔



బియ్యం అక్రమ నిల్వలు, తూకాల్లో మోసాలపై రాష్ట్రవ్యాప్త దాడులు

1,141 తనిఖీలు.. 55 కేసులు, 35 క్రిమినల్ కేసులు నమోదు

దశ, హైదరాబాద్: బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించడం, తూకాల్లో మోసాలకు పాల్పడటంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలు చేపట్టింది. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 5 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టారు. బియ్యం ధరలపై ప్రభుత్వం గరిష్ట రిటైల్ ధరలు (ఎంఆర్‌పీ) నిర్ణయించింది. బీపీటీ/కేఎన్ఎం రకం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ/జేఎస్ఆర్ రకం రూ.79కు మించి విక్రయించరాదని

..మిగతా 4వ పేజీలో ➔

మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ ధరలు తగ్గింపు

నెలవారీ పాస్‌పై రూ.4,500 ఆదా.. రోజువారీ పాస్ ధర రూ.275కు కుదింపు

నవంబర్ 8 నుంచి కొత్త ధరలు అమలు.

దశ, హైదరాబాద్: హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రవేశపెట్టిన ఉమ్మడి ప్రయాణ పాస్ (కామన్ పాస్) ధరలను భారీగా తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో నెలవారీ పాస్‌కు రూ.8,500 వసూలు చేయగా, తాజాగా దాన్ని రూ.4,000కు తగ్గించింది. అలాగే రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.275కు కుదించింది. తగ్గించిన ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి రానున్నాయి. కొత్త ధరల

..మిగతా 4వ పేజీలో ➔

4లో

బీజేపీ రాష్ట్ర పగ్గాలు మళ్లీ బండికే?

ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రరావు పేరు ప్రచారం

రాష్ట్ర అధ్యక్ష మార్పుపై అధిష్ఠానంలో కసరత్తు?

ఓలా, ఉబర్‌లకు టీటుగా విన్‌గ్రూప్

హైదరాబాద్‌లోకి గ్రీన్ ఎస్ఎం!

ఎలక్ట్రిక్ క్యాబ్ సేవల విస్తరణకు సిద్ధం..

తక్కువ ప్రయాణ ఛార్జీలతో పోటీకి అవకాశం..

డ్రైవర్లకు ఉద్యోగాలా.. కొత్త నిబంధనల భారమా?

దశ, హైదరాబాద్: క్యాబ్ సేవల రంగంలో ఇప్పటికే ఆధిపత్యం కొనసాగిస్తున్న ఓలా, ఉబర్ సంస్థలకు పోటీగా వియత్నాంకు చెందిన విన్‌గ్రూప్ అడుగులు వేస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలతో క్యాబ్ సేవలను అందించే గ్రీన్ ఎస్ఎం సంస్థ హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించేందుకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. తక్కువ ప్రయాణ ఛార్జీలు, ఎలక్ట్రిక్ కార్ల వినియోగం, డ్రైవర్లకు స్థిరమైన వేతన విధానం వంటి అంశాలతో ఈ సంస్థ నగర క్యాబ్

..మిగతా 4వ పేజీలో ➔

ఎండిన ప్రతి ఎకరానికి నష్టపరిహారం ఇవ్వాలి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



దశ, మెదక్: నర్సాపూర్ నియోజకవర్గ పర్యటనలో మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పర్యటించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు రాక, సాగునీరు అందక చేతికొచ్చిన వరి పంటలు కళ్లముందే ఎండిపోయాయని హరీశ్ రావు ఎదుట రైతులు వాపోయారు. సకాలంలో కరెంటు అందక తన 7 ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయిందని కంటతడి పెట్టుకున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటల నాణ్యమైన కరెంటుతో రెండు

..మిగతా 4వ పేజీలో ➔

నాగార్జునసాగర్ వరద కాల్వలో విష రసాయనాలు?

నీటి రంగు మారి మృత్యువాతపడిన జలచరాలు..

ట్యాంకర్లతో రసాయనాలు పారబోశారనే అనుమానాలు..

సీసీ కెమెరాలతో పోలీసుల దర్యాప్తు

దశ, నల్గొండ: నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలోని నాగార్జునసాగర్ వరద కాల్వలో రసాయనాలు కలిసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాల్వలోని నీరు అకస్మాత్తుగా రంగు మారడంతో పాటు జలచరాలు చనిపోయి నీటిపై తేలడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంకర్ల ద్వారా



..మిగతా 4వ పేజీలో ➔

సాగర్ వరద కాల్వలో విష రసాయనాలు?

మొదటి పేజీ తరువాయి

రసాయనాలను కాల్వ పరిసరాల్లో పారబోసినట్లు అనుమానిస్తున్నారు. తాగు, సాగునీటి అవసరాలకు ఉపయోగించే కీలకమైన కాల్వలో ఈ ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. నాగార్జునసాగర్ వరద కాల్వ ద్వారా నల్గొండ జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగునీరు, సాగునీరు సరఫరా అవుతోంది. అలాంటి జలవనరులో రసాయనాలు కలిసినట్లు అనుమానాలు రావడంతో కాల్వ నీటిపై ఆధారపడే ప్రజలు, రైతుల్లో ఆందోళన నెలకొంది. నీటి రంగు మారడం, చేపలు తదితర జలచరాలు మృత్యువాతపడటం వెనుక విషపూరిత రసాయనాల ప్రభావం ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. అయితే కాల్వలో కలిసిన రసాయనాలు ఏవి? వాటి తీవ్రత ఎంత? నీటి నాణ్యతపై ఎలాంటి ప్రభావం చూపాయి? అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని కాల్వ పరిసరాలను పరిశీలించారు. సుమారు అర కిలోమీటరు మేర తనిఖీలు చేపట్టారు. కోదాడ-



జడ్చర్ల జాతీయ రహదారికి సమీపంలోని కొత్తగూడెం ప్రాంతంలో కాల్వకు సుమారు 15 మీటర్ల దూరంలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించినట్లు నీటిపారుదల శాఖ ఏఈ మల్లయ్య వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరోవైపు రసాయనాలను పారబోసిన వారిని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వరద కాల్వ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ అనుమానిత ట్యాంకర్లను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. కాల్వ వెంట గస్తీని కూడా పెంచినట్లు పెద్దవూర ఎస్సై గోపాల్‌రావు తెలిపారు. రసాయనాలను ఎవరు తీసుకొచ్చారు? ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎందుకు పారబోశారు? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. తాగు, సాగునీటికి ఆధారమైన కాల్వలో రసాయన వ్యర్థాలు కలవడం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పుగా మారే ప్రమాదం ఉంది. కాల్వ నీటి నమూనాలను సేకరించి రసాయన పరీక్షలు నిర్వహించడం, నీరు వినియోగానికి సురక్షితమేనా అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వడం అత్యవసరంగా మారింది. ఘటనకు బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నీటి వనరుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్పోర్ట్స్ బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

తండ్రి నిరాకరించడంతో మనస్తాపం..
ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

దశ, ఖమ్మం: స్పోర్ట్స్ బైక్ కొనివ్వలేదన్న మనస్తాపంతో ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. జశ్వంత్ తేజ (20)అనేయువకుడుగడ్డిమందుతాగిఆత్మహత్యాయత్నం చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న జశ్వంత్ తేజ స్నేహితులతో కలిసి అద్దె గదిలో ఉంటున్నాడు. తనకు స్పోర్ట్స్ బైక్ కొనివ్వాలని తండ్రిని కోరాడు. అయితే ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉన్నందున ప్రస్తుతం ఖరీదైన స్పోర్ట్స్ బైక్ కొనలేనని, సాధారణ బైక్ కొనిస్తానని తండ్రి నచ్చజెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన జశ్వంత్ అక్టోబర్ 14న తాను ఉంటున్న గది డాబాపై గడ్డి మందు తాగాడు. అనంతరం హైదరాబాద్‌లో ఉన్న తన అన్న చరణ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. చరణ్ వెంటనే సమాచారం అందించడంతో రూమ్‌మేట్లు జశ్వంత్‌ను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి గురువారం రాత్రి కన్నుమూశాడు.

రాజధానిలో నీటి కష్టాలు

మొదటి పేజీ తరువాయి

సరిపడా నీరు అందడం లేదు. ప్రత్యామ్నాయంగా నీటిని తెప్పించుకునేందుకు ప్రయత్నించినా అవసరాలకు తగినంత సరఫరా లభించడం లేదని తెలుస్తోంది. దీంతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను తాత్కాలికంగా ఇళ్లకు పంపించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తల్లిదండ్రులకు సమాచారం అందించి తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు తమ బోర్లపై రెవెన్యూ, హైడ్రా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే బోర్లపై చర్యలు తీసుకోవడం వల్ల తమ ఉపాధి దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్యాంకర్ల బంద్‌కు దిగారు. నిరసనలో భాగంగా కొన్ని ట్యాంకర్లను అడ్డుకోవడం, వాటిలోని నీటిని రోడ్లపై పారబోయడం విమర్శలకు తావిచ్చింది. నీటి కొరతతో ప్రజలు అల్లాడుతున్న సమయంలో నీటిని ఇలా వృథా చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు, నీటి వనరుల



పరిరక్షణకు సంబంధించిన ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ నీటి సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నోటీసులు జారీ అవుతున్నాయి. ఒకవైపు భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్న ఆందోళన, మరోవైపు ట్యాంకర్ల సరఫరాలో అంతరాయం వెరసి నగరవాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. అక్రమ నీటి వనరులపై చర్యలు తీసుకోవడంతో పాటు, హాస్టళ్లు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం, జలమండలి తక్షణమే ప్రత్యామ్నాయ నీటి సరఫరా చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. నీటి వనరుల పరిరక్షణతో పాటు ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఓలా, ఉబర్‌లకు దీటుగా విన్‌గ్రూప్

మొదటి పేజీ తరువాయి



మార్కెట్‌లో ఎలాంటి మార్పులు తీసుకొస్తుందన్న ఆసక్తి నెలకొంది. తెలంగాణలో ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడంతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 2025 డిసెంబర్ 9న తెలంగాణ ప్రభుత్వం, వియత్నాంకు చెందిన విన్‌గ్రూప్ మధ్య సుమారు 3 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్యాబ్ సేవలు, ఛార్జింగ్ కేంద్రాలు, స్మార్ట్ సిటీ అభివృద్ధి తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ గ్రూప్‌లో భాగమైన గ్రీన్ ఎస్ఎం ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలతో రవాణా సేవలను నిర్వహిస్తోంది. ఇప్పటికే 2026 జూన్ 5న ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో వెయ్యి ఎలక్ట్రిక్ కార్లతో సేవలను ప్రారంభించింది. భవిష్యత్తులో వాహనాల సంఖ్యను 10 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌లోనూ గ్రీన్ ఎస్ఎంకు చెందిన కార్లు కనిపిస్తుండటంతో సంస్థ కార్యకలాపాల విస్తరణపై చర్చ మొదలైంది. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఈ సంస్థ కిలోమీటర్‌కు సుమారు రూ.9 ఛార్జీ వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. అదే హైదరాబాద్‌లో ఓలా, ఉబర్ వంటి సంస్థల్లో సాధారణంగా కిలోమీటర్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు ఛార్జీలు ఉంటున్నాయి. అయితే ట్రాఫిక్, ప్రయాణ దూరం, డిమాండ్, వాహనం రకాన్ని బట్టి ఈ ధరల్లో మార్పులు ఉంటాయి. గ్రీన్ ఎస్ఎం తక్కువ ధరలతో సేవలు అందిస్తే ప్రయాణికులకు కొంత మేరకు ఊరట కలిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు క్యాబ్ డ్రైవర్ల ఆదాయంపై కూడా ఈ సంస్థ విధానం ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం ఓలా, ఉబర్ వంటి సంస్థలు డ్రైవర్ల ఆదాయం నుంచి సుమారు 20 నుంచి 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నట్లు అంచనాలు ఉన్నాయి. ర్యాపిడో క్యాబ్స్ రోజువారీ సబ్‌స్క్రిప్షన్, చిన్న పాస్‌ల విధానం ద్వారా జీరో కమిషన్ మోడల్‌ను కూడా అందిస్తోంది. రోజుకు రూ.3 వేల స్థూల ఆదాయం వచ్చే క్యాబ్ డ్రైవర్‌కు కంపెనీ కమిషన్ లేదా సబ్‌స్క్రిప్షన్ రూపంలో రూ.100 నుంచి రూ.600 వరకు ఖర్చవుతోంది. ఇంధనం, వాహన నిర్వహణ, టోల్ ఛార్జీలు తదితర ఖర్చులు పోను రోజుకు రూ.1,200 నుంచి రూ.1,600 వరకు మాత్రమే మిగులుతున్నట్లు అంచనా. తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ 2026 ఫిబ్రవరిలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 1.5 లక్షల మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి పనిచేస్తున్న వారు మరో 15 వేల మంది వరకు ఉన్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త సంస్థ ప్రవేశం క్యాబ్ డ్రైవర్ల ఉపాధి, ఆదాయ విధానాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అయితే గ్రీన్ ఎస్ఎం విధానం ఓలా, ఉబర్ విధానానికి భిన్నంగా ఉండనుంది. ప్రస్తుతం ఓలా, ఉబర్ డ్రైవర్లు తమకు అనుకూలమైన సమయంలో యాప్‌లో లాగిన్, లాగౌట్ అయ్యే స్వేచ్ఛ కలిగి ఉన్నారు. గ్రీన్ ఎస్ఎం మాత్రం డ్రైవర్లను నేరుగా నియమించుకుని, కార్పొరేట్ ఉద్యోగుల తరహాలో నిర్ణీత పని గంటలు, సంస్థ నిబంధనల ప్రకారం పనిచేయించే విధానాన్ని అనుసరిస్తున్నట్లు సమాచారం. ఢిల్లీలో రోజుకు 12 గంటలు పనిచేసే డ్రైవర్లకు నెలకు సుమారు రూ.35 వేల వేతనం ఇస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వేతనం పొందేందుకు డ్రైవర్లకు కొన్ని కఠినమైన నిబంధనలు ఉన్నట్లు సమాచారం. కేటాయించిన రైడ్లలో కనీసం 90 శాతం అంగీకరించి పూర్తి చేయాలి. కస్టమర్ల నుంచి 4.8 రేటింగ్ సాధించాలి. బుక్ చేసిన ప్రయాణాన్ని మధ్యలో రద్దు చేయకూడదు. ఈ నిబంధనలపై ఢిల్లీలోని కొందరు డ్రైవర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ట్రాఫిక్ రద్దీ, దూర ప్రాంతాలకు ప్రయాణాలు, 10 నుంచి 12 గంటల పాటు డ్రైవింగ్ చేయడం వల్ల అలసటకు గురవుతున్నామని చెబుతున్నారు. ఛార్జింగ్ కేంద్రాల కొరతతో సమయం వృథా అవుతోందని, ఆదాయ హామీ, చెల్లింపుల విషయంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. మొత్తంగా గ్రీన్ ఎస్ఎం హైదరాబాద్‌లోకి విస్తరిస్తే ప్రయాణికులకు తక్కువ ధరలతో సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అదే సమయంలో డ్రైవర్లకు స్థిరమైన వేతనం, ఉద్యోగ భద్రత లభిస్తాయా? లేక కఠినమైన పని నిబంధనలతో కొత్త సవాళ్లు ఎదురవుతాయా? అన్నది చూడాలి. ఓలా, ఉబర్ ఆధిపత్యం కొనసాగుతున్న క్యాబ్ మార్కెట్‌లో విన్‌గ్రూప్ ప్రవేశం ఎలాంటి పోటీని సృష్టిస్తుందో రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

ఎండిన ప్రతి ఎకరానికి నష్టపరిహారం ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి

పంటలు పండించుకున్నాం.. ఇప్పుడు కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని అన్నారు. వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలవుతున్నా.. కనీసం ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా ఇటువైపు కన్నెత్తి చూడలేదని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.రైతన్నలు అధైర్యపడకండి..ఈరెండేళ్లు సీఎం రేవంత్ రెడ్డి మెడలు వంచి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని హరీశ్ రావు భరోసా ఇచ్చారు. మార్పు అంటే కేసీఆర్ ఇచ్చిన 24 గంటల కరెంటును, రైతుబంధును బంద్ పెట్టి పచ్చని పొలాలను ఎండబెట్టడమేనా అని హరీష్ రావు .. రేవంత్ ప్రభుత్వంపై ధ్వజం ఎత్తారు. ఎండిన ప్రతి ఎకరానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చే వరకు పెండింగ్ రైతుబంధు, పూర్తిస్థాయి రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు.

బేతుపల్లి చెరువు ఘటన.. సహాయక బృందాలకు సీఎం అభినందనలు

దశ, హైదరాబాద్: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో చేపట్టిన సహాయక చర్యల్లో పాల్గొన్న ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందితో పాటు అధికారులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అభినందించారు. భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న చెరువులో గల్లంతైన మత్స్యకారులు, వారిని రక్షించేందుకు వెళ్లి చిక్కుకుపోయిన ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు బృందాలు సమన్వయంతో పనిచేయడాన్ని ప్రశంసించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సిబ్బంది ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అంకితభావం అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చార్జింగ్‌లో ఉన్న ఎలక్ట్రిక్ కాంటా ప్రాణాంతకం

మొదటి పేజీ తరువాయి

తాకినట్లు సమాచారం. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురైన చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కళ్లముందే ఆడుకుంటూ తిరిగిన బిడ్డ విగతజీవిగా మారడంతో తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ ఘటనతో రాజారాంపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నపిల్లలు ఉన్న ఇళ్లలో విద్యుత్ పరికరాలు, చార్జింగ్ వైర్లు అందుబాటులో లేకుండా ఉంచాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.



మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ ధరలు తగ్గింపు

మొదటి పేజీ తరువాయి

ప్రకారం నెలవారీ పాస్‌లో రూ.3,000 మెట్రో ప్రయాణాలకు, రూ.1,000 ఆర్టీసీ బస్సు ప్రయాణాలకు కేటాయించారు. ఈ పాస్‌తో నెలలో గరిష్టంగా 50 మెట్రో సింగిల్ జర్నీలు చేసుకోవచ్చు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఎలాంటి పరిమితి ఉండదు. పాత ధరతో పోలిస్తే నెలవారీ పాస్ వినియోగదారులకు రూ.4,500 ఆదా కానుంది. అదేవిధంగా రోజువారీ ఉమ్మడి పాస్ ధరను రూ.275గా నిర్ణయించారు. ఇందులో రూ.200 మెట్రోకు, రూ.75 ఆర్టీసీకి కేటాయించారు. ఈ పాస్‌తో రోజుకు నాలుగు సింగిల్ జర్నీలు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతో రోజువారీ పాస్ వినియోగదారులకు రూ.125 మేర ప్రయోజనం కలగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ధరలను సవరించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించడంతోపాటు ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా వినియోగించేలా ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మెట్రో, ఆర్టీసీ సేవలను ఒకే పాస్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ గతంలో నిర్ణయించిన ధరలు అధికంగా ఉన్నాయంటూ ప్రయాణికుల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధరలను తగ్గించడం నగర ప్రయాణికులకు ఊరటనివ్వనుంది.

బియ్యం అక్రమ నిల్వలు, తూకాల్లో మోసాలపై రాష్ట్రవ్యాప్త దాడులు

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేసింది. ప్రతి 26 కిలోల బస్తాపై నిర్ణీత ఎంఆర్‌పీ ముద్రించాలని ఆదేశించింది. వారం రోజుల పాటు రైస్ మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో 1,141 ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 55 కేసులు, 35 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తూనికలు, కొలతల శాఖ మరో 1,545 తనిఖీలు నిర్వహించి 280 కేసులు నమోదు చేసింది. బస్తాల్లో 25 కిలోల బియ్యం ఉంచి 26 కిలోలుగా లేబుల్ వేయడం, అసలు ధరపై అధిక ధరల స్టిక్కర్లు అంటించడం, పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, జీఎస్టీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేకుండా వ్యాపారం చేయడం వంటి ఉల్లంఘనలను గుర్తించారు. పదేపదే అక్రమ నిల్వలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు నిత్యావసర సరుకుల చట్టం, బీఎన్ఎస్ కింద చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. వినియోగదారులను మోసం చేసే వ్యాపారులపై నిఘా, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

బీజేపీ రాష్ట్ర పగ్గాలు మళ్లీ బండికే?

ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రరావు పేరు ప్రచారం

దశ, కరీంనగర్: తెలంగాణ బీజేపీ రాజకీయాల్లో మరోసారి రాష్ట్ర అధ్యక్ష పదవి మార్పుపై చర్చ మొదలైంది. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం ఎంపిక చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే ఖాళీ అయ్యే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను తిరిగి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు అప్పగించే అవకాశాలున్నాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. గతంలో బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తెలంగాణలో బీజేపీ దూకుడుగా రాజకీయ కార్యకలాపాలు నిర్వహించింది. ఆయన చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్ర పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో పార్టీ విజయాలు సాధించడంతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ గణనీయమైన ఫలితాలు సాధించింది. దీంతో బీజేపీ రాష్ట్రంలో బలమైన ప్రతిపక్ష శక్తిగా ఎదిగింది. అయితే సంజయ్ దూకుడు రాజకీయ శైలి పార్టీలోని కొందరు సీనియర్ నేతలకు అసంతృప్తి కలిగించిందనే ప్రచారం అప్పట్లో జరిగింది. అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య సమన్వయ సమస్యల నేపథ్యంలో ఎన్నికలకు ముందు ఆయనను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించి జి. కిషన్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత పార్టీ నాయకత్వంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు ఉత్సాహం కల్పించడం అధిష్ఠానానికి ప్రధాన సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో దూకుడైన రాజకీయ పోరాటాలకు పేరున్న బండి సంజయ్‌కు మళ్లీ బాధ్యతలు అప్పగించాలనే అభిప్రాయం పార్టీలోని కొన్ని వర్గాల్లో ఉన్నట్లు సమాచారం. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, నాయకత్వ మార్పులపై చర్చ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. రామచంద్రరావుకు ఎమ్మెల్సీ బాధ్యతలు అప్పగిస్తే రాష్ట్ర అధ్యక్ష పదవికి కొత్త నాయకుడిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ పేరు ప్రధానంగా వినిపిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే రాష్ట్ర అధ్యక్ష పదవిపై బీజేపీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం వినిపిస్తున్నవన్నీ రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలు, ఊహాగానాలే. ఒకవేళ బండి సంజయ్‌కు మరోసారి పార్టీ పగ్గాలు అప్పగిస్తే తెలంగాణలో బీజేపీ రాజకీయ వ్యూహాలు, కాంగ్రెస్‌తో పోరాటం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దాని ప్రభావం ఉండే అవకాశం ఉంది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com